# విధివంచిత ద్రౌపది

-డా॥ ఎస్వీభుజంగరాయశర్మ

(భుజంగరాయశర్మ ఆకాశవాణిలో ప్రసారం చేసిన వాక్ చిత్రాలు కొన్నింటిని "దీపమాలిక" పేరిట ఆహ్వానం లక్ష్మి పుస్తకంగా తీసుకు వచ్చారు. గాలికి కొట్టుకు పోకుండా అపురూపమైన దీపమాలికను పదిలపరచిన లక్ష్మిగారి సౌజన్యంతో....)

జీవితం నటన కాదు. నటనలో జీవించే వారికీ, జీవితంలో నటించేవారికీ కూడా నటనకు సంబంధించని వేరే జీవితం వుంటుంది. ఉండకపోతే వాళ్ళంత దురదృష్టవంతులు లోకంలో వుండరు.

లోకంలో వున్న దురదృష్టవంతులందరిలోనూ మరీ దురదృష్టవతిగా కనబడుతుంది నాకు ద్రౌపది.

ఎందరో మగవారికి ఏ అరమరికలూ లేకుండా శరీరాన్ని అప్పగించిన స్త్రీలున్నారు. ఒకరి తర్వాత ఒకరినిగా ఎందరో భర్తల్ని కట్టుకున్న స్త్రీలూ వున్నారు. కాని ఒకేసారి అయిదుగురిని పెళ్ళాడిన స్త్రీ – జీవితాంతం ఆ అయిదుగురితోనూ కాపురం చేసిన స్త్రీ – ఎన్నడూ ఆ అయిదుగురి మధ్యా దాంపత్య సంబంధమైన అనుమానం గానీ, అసూయ గానీ, అసంతృప్తిగానీ కలగనీకుండా, నిర్వహించుకువచ్చిన స్త్రీ చరిత్రలో మరెవరైనా, వున్నారేమో వెదికి చూడండి.

వంతుల ప్రకారం అయిదుగురితో కాపురం చేయటం ఏ భార్యకూ సహజం కాదు. సహజం కాని యీ బాధ్యత తెచ్చిపెట్టే మానసిక సమస్యలను వ్యాసుడు గుర్తించ లేదు. కుంతి పట్టించుకోలేదు. ద్రుపదుడు వూహించలేదు. పాండవులలో ఒక్కరూ అర్థం చేసుకున్న దాఖలా లేదు.

అర్జునునికోసమే వుట్టిన తాను, అర్జునునికోసం కలలు కనటం తప్ప మరేమీ తెలియని తాను, అర్జునుని రప్పించడం కోసమే యేర్పాటైన స్వయంవరంలో గొప్ప తేజస్వి ఒకడు మత్స్య యంత్రాన్ని కొట్టి తన్ను గెలుచుకున్న వేళ --

పదహారేళ్ళ పెళ్లికూతురుగా--

ఆనందమో, నిరాశో, నమ్మకమో, దిగులో ఏదో తెలియని – యేదీ నిలవని – అన్నీ కలిసిన – ఓ విచిత్రమైన వివశతను అనుభవించింది, ద్రౌపది.

తీరా, తన్ను గెలుచుకున్నది అర్జునుడే అని తెలిసి, పాలకడలిలాటి తన మనస్సు ఉప్పొంగిపోయేలోగా అందులో అమృతంతో పాటు హాలాహలమూ సుడులు కట్టింది.

అమాయకంగా కుంతీ, మూర్ఖంగా పాండవులూ, అనుమానంగా ద్రుపదుడూ, విధి నిర్ణయంగా వ్యాసుడూ ఆమె గుండెను అయిదు ముక్కలు చేశారు.

ఆ అయిదు ముక్కలనూ కూడదీసుకుని, అతికి, రాయిచేసుకుని, మౌనంగా దాంపత్య జీవితంలోకి అడుగు పెట్టింది, ద్రౌపది.

ప్రేమించగల స్త్రీ మనస్సు ఇరుకు. అందులో ఒక్కడికే చోటు.

ఒక్కరి చోటులో అయిదుగురు ఇమడడం యెంత అసంభవమో, అయిదుగురు భర్తల్ని ఒక్క భార్య ప్రేమించటం కూడా అంత అసాధ్యం.

ఇక్కడ ప్రేమ అంటే – అస్తిత్వపు లోలోతులను రగిలించే తృష్ణ, తృప్తి, త్యాగం, అర్పణ, ఆరాధన, తపన, మొదలైన అనుభూతుల సమిష్టిశక్తి.

ఇలాటి శక్తికి ఆధారం కాగల పురుషుడొక్కడే వుంటాడు స్త్రీ జీవితంలో – అని ప్రణయమనస్తత్వాన్ని విశ్లేషించిన శాస్త్రజ్ఞులంటారు.

ఒక్కరి విషయంలో మాత్రమే సాధ్యమయ్యే ప్రేమను అయిదుగురి విషయంలోనూ సాధ్యమనిపించిది ద్రౌపది.

ఇది నిజమా? కాదు.

నటనా? కాదు.

జీవితానికి నటనకూ వున్న హద్దులు చెరిగిపోయి, నటించటమే వూపిరిగా, ఊపిరి పీల్చడమే నటనగా మారిపోయిన బ్రతుకులోని

విషాదాన్నీ, ఆ విషాదంలోని ఆకర్షణనూ, చిత్రించటం, నిజానికి, ఏ రచయితకూ సులువు కాదు – తిక్కన్నవంటి యే ప్రతిభావంతులకో తప్ప!

ఏ జీవితాన్నైనా ఓ నాటకంగా దర్శించటం తిక్కన్న గారికి అలవాటు. ఏ వ్యక్తినైనా ఓ నాటక పాత్రగా నిర్మించటం వారి అభిరుచి. ఏ సన్నివేశాన్నైనా ఓ దృశ్యంగా భావించడం వారికి పరిపాటి.

అందుకే తిక్కన్నగారి చేతిలో ద్రౌపది – ఓ అద్భుతమైన రూపకోచిత సృష్టి.

"పలుపోకల పోవుచు వి
చ్చల విడి నాట్యంబు సూపుచాడ్పున, నిచటన్
కులసతుల గరువచందము
తొలఁగఁగ నిట్లునికి తగునె!"

అని ధర్మరాజే మందలించవలసి వచ్చేంత నాటకీయంగా ప్రవర్తించింది, ఒక రోజు విరటుని నిండుకొలువులో, కీచకుడు తన్ను తన్నిన వేళ – తాను క్రిందపడి పోయిన వేళ – ద్రౌపది!

తన్నిన కీచకుడు అక్కడే నిలబడి వున్నాడు. ద్రౌపది మెల్లగా లేచింది.

ఒంటి నిండా దుమ్ము.

గుండెనిండా రొప్పు.

జుట్టు చెల్లాచెదరైంది. రోషంతో కళ్ళు కారిపోతున్నాయి.

చేతనైనంత దృఢంగా అడుగులు వేస్తూ – ముందుకు నడిచింది. నడుస్తూ ఎర్రగా అందరినీ కలయజూచింది. తన భర్తలు కంట బడగానే ఛీ అనుకుంది.

"... ... గంధర్వు లేవురు నన్ను నిట్టు
లొకడు పరుపంగ నూరక యునికి చూడ
నచ్చెరువు కాదె? యెవ్వరి యాండ్రు రింక
బరిభవంబును బొందక బ్రతుకువారు!"

అని అందరి కళ్ళల్లోకి చూస్తూ అడిగింది. కీచకుడక్కడే వున్నాడు. ఒక్కడూ నోరు మెదపలేదు.

"ఈ నరపతి యాస్థానము
లో నొక్కరుడైన ధర్మలోపభయమునన్
బూని తగవైన వెడ పలు
కైనను బలకంగా జాలడయ్యెడు నకటా"

అని దిగ్భ్రాంతి ప్రకటించింది.

విరటుడు నిస్సహాయంగా కీచకుడి వంక చూచాడు. ద్రౌపది గమనించింది. ఒళ్ళు మండి, కుడిచేతి చూపుడు వ్రేలిని విరటుని ముఖంవైపు గ్రుచ్చుతూ--

"ఐనను మత్స్యదేశమున
నాజ్ఞ కితండొడయండు కాన నా
కీ నరనాథు దూరఁదగు"

అని విసురుగా పలికింది.

విరటుడు కలవరపడ్డాడు. కీచకుణ్ని బతిమాలాడు. బుజ్జగించాడు. ఇంటికి పంపించాడు.

ఇది చూచి కొలువులోని వారందరూ ఆశ్చర్య పడ్డారే గాని, ఒక్కడు నోరెత్తితే ఒట్టు.

ధర్మరాజు ద్రౌపదికీ నచ్చచెప్పి సుదేష్ణ మందిరానికి పంపే ప్రయత్నం చేశాడు. ద్రౌపది కదల్లేదు. పైగా ఏదో అనబోయింది.

"ఆగు, ఊరుకున్నకొద్దీ నాటకంలో వేషంలా చేతులు తిప్పుతూ, ఛీ, యేమిటా అభినయం? పైగా యిల్లాలినంటావు, ఇల్లాళ్లిలాగే ప్రవర్తిస్తారా?" అని ధర్మరాజు కోప్పడ్డాడు.

ద్రౌపది విపరీతంగా గాయపడింది. నిజమే, తను ఏపని చేసినా అభినయంలా వుంటుంది. తన ప్రతిచూపూ, ప్రతిమాటా, ప్రతి కదలికా అందంగా తీర్చినట్లుంటాయని అందరూ అంటారు. మాట్లాడేటప్పుడు అప్రయత్నంగా చేతులు కదులుతాయని తనకూ తెలుసు. ఏ భావమైనా స్వచ్ఛంగా స్పష్టంగా ప్రతిఫలించే ముఖం తనది. అయితే–

తను కొలువుకు రావటం తప్పా?

వచ్చి మొరపెట్టుకోవటం తప్పా?

మొరను ఆలకించకపోతే, ఎందుకాలకించరని అడగటం తప్పా?

యేది తప్పు?

మాట్లాడే తీరులోని తన విలక్షణతను ఆసరా చేసుకుని యింత నీచంగా మాట్లాడతాడా నలుగురిలో!

పైగా -- తనలో యిల్లాలి లక్షణాలే లేవట! యెంత దారుణం! అయ్యో, తన బాధ యెవరి కర్థమౌతుంది? ఇందాక – కీచకుణ్ని అక్కడికక్కడే చంపేద్దామన్నంత కోపం భీముడికి రావడం – ధర్మరాజు ఆ కోపాన్ని రహస్యంగా చల్లార్చటం గుర్తుకొచ్చింది.

ద్రౌపది కడుపు మండింది.

తలెత్తి ధర్మరాజు ముఖంలోకి చూస్తూ రెండడుగులు వేసి--

"నాదు వల్లంభుడు నటుఁడింత నిక్కంబు
పెద్దవారియట్ల పిన్నవారు
కాన -- పతులవిధమకాక, యే శైలూషి
కా ననంగరాదు కంకభట్ట!"

అని గద్దించింది.

"కంకభట్ట" అన్న పిలుపులో వున్న సెగకు ధర్మరాజు వెనక్కితగ్గాడు, రెండు క్షణాలు అతణ్నే చూస్తూ నిలబడ్డది ద్రౌపది.

"మత్పతి శైలూషండ కాదు, కితవుండునుం గావున జూదరియాలికి గరువతనం బెక్కడియది? అని ముఖాన అడిగేసి, అక్కడో క్షణం నిలవకుండా చరచరా అదృశ్యమై పోయింది.

ద్రౌపదికి ఆ రాత్రి ఓ పట్టాన తెల్లారలేదు. అంతఃపురం సద్దుమణిగి, అందరూ నిద్రపోయాక, రహస్యంగా వెళ్ళి భీముణ్ని నిద్రలేపింది.

కీచకుని కథ చెప్పటం మొదలెట్టింది.

భర్తల పరాక్రమం వర్ణించి అతణ్ని తానెలా బెదరగొట్టిందో చెప్పింది.

కీచకుడు కొన్ని ప్రల్లదాలు పలికాడని మాత్రం చెప్పి -- ఆ ప్రల్లదాలేవో చెప్పక భీముణ్ని రెచ్చగొట్టింది.

విరటుని కొలువులో తనకు జరిగిన అవమానాన్ని ప్రస్తావించి "మీ అన్న పెద్దతనము చూచితి" అని ధర్మరాజును దెప్పి పొడిచింది.

"నన్ను కీచకుండు తన్నంగ, ఎట్టులు
చూడనేర్చె ధర్మసూనుడపుడు?"

అని ప్రశ్నిస్తూ భీముణ్ని అన్నమీదికి వుసికొలిపింది.

కాని--

ఏ గుణాన వున్నాడో భీముడు, ధర్మరాజు సహనాన్ని మెచ్చుకుని, కీచకుణ్ని చంపబోయిన తన అజ్ఞానానికి నొచ్చుకుని, ధర్మరాజును తప్పుబట్టిన ద్రౌపది అవివేకాన్ని ఖండించాడు.

కథ అడ్డం తిరిగింది.

ద్రౌపది నిర్ఘాంతపోయింది.

మరుక్షణం తన్ను తాను సంబాళించుకుని ధర్మరాజును ఆకాశానికెత్తేసింది.

"ఎవ్వాని వాకిట నిభమదపంకంబు
రాజభూషణరజోరాజి నడఁగు"

అంటూ మొదలైన ఉపన్యాసాన్ని అనర్గళంగా, అతి సహజంగా అద్భుతంగా సాగించింది.

ధర్మజుని గొప్పతనంతో పాటు -- భీముని బలసంపదను వర్ణించింది, అర్జునుని పరాక్రమాన్ని వర్ణించింది, నకులుని సాహసాన్ని వర్ణించింది, సహదేవుని సౌకుమార్యాన్ని వర్ణించింది.

భీముణ్ని నివ్వెరపుచ్చి, అమాయకపరిచి, సంతోషపెట్టి లొంగదీసుకుంది.

అతనివంక తను కాంక్షగా చూస్తుంటే తన చూపులు పసికట్టిన జనం ఎలా గుసగుస లాడుకుంటారో చెప్పి భీముణ్ని పులకరింపజేసింది.

సుధేష్ణకు పనులు చేసిచేసి కాయలు కాసిపోయిన తన చేతుల్ని భీముని చేతుల్లో పెట్టి, రొమ్ముమీద వాలిపోయింది. భోరున తానేడ్చి, అంతగానూ అతడినీ ఏడ్పించింది. చివరికి --

"వాని డెగజూడ వైతేని, వాయుపుత్ర,
నీవు కనుగొన - నురినైన, నీరనైన
నగ్నినైన, విషంబునైన, నేను
మేను దొరగుదునెట్లు - నీ యాన సుమ్ము"

అని బెదరగొట్టి అతణ్ని పూర్తిగా బానిసను చేసుకుంది.

"ఎల్లి - ఎల్లవిధంబుల నెందుజొచ్చె
నేని - ఆ ధర్మతనయుండు తాన వచ్చి
యడ్డుపడెనేని - నీవ పెంపారు కరుణ
కాచితేని - నాచే బడు కీచకుండు!"

అని ప్రతిజ్ఞ చేయించి, మరునాటి రాత్రి అతడిచేతనే కీచకుణ్ని దారుణంగా చంపించింది. పట్టినపగ చల్లార్చుకుంది.

పగలు --

విరటుని కొలువులో తాను చేయని నటనకు, నలుగురిలో అవమానం పాలయింది. మనస్సు గాయపడింది.

రాత్రి --

భీమునియెదట తాను చేసిన నటనకు, కొలువులో దొరకని ఊరట దొరికింది. పగ చల్లారింది.

ద్రౌపది జీవితంలోని విషాదమంతా యీ వైపరీత్యంలో వుంది.

కృష్ణుడు రాయబారానికి వెళ్ళేముందు పాండవులందరూ సంధి కావాలనే కోరారు. ఒక్క సహదేవుడు తప్ప. సంధి జరిపించడానికే కృష్ణుడు

హస్తినకు బయలు దేరాడు.

ద్రౌపదికి జరిగిన అవమానంగానీ, కురుసభలో భీముడు చేసిన ప్రతిజ్ఞ కానీ, యెవరికీ గుర్తున్నట్లు లేదు. గుర్తున్నా, పట్టించుకున్నట్లు లేదు.

ద్రౌపది గుండె బద్దలు కావడానికి సిద్ధంగా వుంది.

కృష్ణుడు దాన్ని కదపనే కదిపాడు. అప్పుడు ద్రౌపది --

"నీవు సుభద్రకంటె కడు
నెయ్యము గారవముం దలిర్ప సం
భావన సేయు; దిట్టి నను
బంకజనాభ యొకండు రాజసూ
యావభృథంబునందు శుచి
యై పెనుపొందిన వేణి బట్టి యీ
యేవురు చూడగా సభకు
నీడ్చె కులాంగన లిట్టి వోర్తురే?"

అని కృష్ణుణ్నే ప్రశ్నించింది.

ఆ ప్రశ్నలో -- నీ చెల్లెలు సుభద్రకే యింతటి అవమానం జరిగితే నీవు సహించి వూరుకోగలవా - అనే ధ్వని వుండటం గమనించి అంతటి అవతార పురుషుడూ నివ్వెరపోయాడు.

తటాలున లేచి ముడివిప్పి, కాలనాగంలా జారిపడిన వెంట్రుకల్ని ఎడం చేత ఎత్తిపట్టి

"ఇవి దుస్ససేను వ్రేళ్లం
దవిలి సగము త్రెవ్విపోయి దక్కినయవి; కౌ
రవుల కడ దీరుమాటల
యవసరమున దలపవలయు నచ్యుత వీనిన్!

అని ఆవేశంగా హెచ్చరించింది.

కౌరవసభలో, సంధిప్రసంగం చేసే వేళ, దుశ్శాసనుడు పట్టి యీడ్వగా సగం తెగి మిగిలిపోయిన ఆ వెంట్రుకలు కళ్ళ యెదట కదులుతూ కనబడుతోంటే కృష్ణుడికి మాత్రం సంధి కుదర్చటం సాధ్యమా!

కృష్ణుడు చకితుడయ్యాడు.

ద్రౌపది కట్టలు తెంచుకుంది.

తన వెంట్రుకలు పట్టి యీడ్చిన దుశ్శాసనుని శరీరం ముక్కలుముక్కలై యుద్ధ రంగంలో చెల్లాచెదురుగా పడి వుండడం చూస్తేగాని తన అవమానాగ్ని చల్లారదదంది, దుర్యోధనుని పీనుగును కళ్ళారా తాను చూడందే భీముని బాహుబలం గానీ, అర్జునుని పరాక్రమం గానీ యెందుకు తగలెయ్యనా అంది, నిప్పును ఒడిలో దాచుకున్నట్లు ఇంతటి కోపాన్నీ యిన్నేళ్లూ రక్కసతాల్మితో భరించా నంది, అంటూ యెలుగెత్తి యేడ్చింది. ఓదార్చటం యెలాగో యెవరికీ తోచనంతగా యేడ్చింది.

చివరికి--

సంధిసంధాతగా వెళ్ళే కృష్ణుని నోటనే యుద్ధాన్ని గురించీ, కౌరవవినాశాన్ని గురించీ పలికించింది.

ఇందులో జీవితమెంత?

నటన ఎంత?

జీవితమే నటనలా కనబడేంతటి దారుణమైన అనుభవాలు, ఆ అనుభవాలు అలవాటు చేసిన వింత నడవడి, ఆ నడవడి తెచ్చిపెట్టిన భయంకర సమస్యలు--

వీటికి తోడు అద్భుతమైన నల్లరాతి శిల్పానికి ప్రాణం వచ్చినట్లుండే స్త్రీత్వం. ఎదటి వాడికి వూపిరాడనివ్వని దాని ఆకర్షణ --

వీటన్నిటి వెరసి ద్రౌపది.

స్వార్థం తప్ప పరార్థం తెలియని పురుషత్వానికి ప్రయోగ రంగమై, దాంపత్యంలో అయిదు అభిరుచులను మెప్పించి అయిదు రకాల దాహాలను తీర్చి -- ఆనాటి గొప్ప పతివ్రతల సరసన, వారికన్నా కొంచెం పొడగిరిగా నిలబడిందామె.

ఇంత చేసినా, ధర్మరాజు చివరికి అననే అన్నాడు, "ఇమ్మగువ యింద్రతనయు నెడ పక్షపాతిని' అని!

పాండవులు స్వర్గారోహణం చేస్తున్నారు. ఇరుకుదారి, పాండవుల వెనక ద్రౌపది నడుస్తోంది. ద్రౌపది వెనక కుక్క రూపంలో యముడు!

ఉన్నట్టుండి, ద్రౌపది కూలిపోయి ప్రాణాలు విడిచింది.

ధర్మరాజు భీమునితో---

"బ్రతికినన్నాళ్ళూ అర్జునుడంటే పడి చచ్చింది. అందుకే యిప్పుడు పడి, చచ్చిపోయింది" అని వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగిపోయాడు.

ద్రౌపది జీవన విషాదం ఎవరికీ అర్థం కాలేదు, కాదు.

ఆమె మరో పేరు, విధివంచిత! ■